అమిత్‌షా వ్యాఖ్యలు బాధాకరం

అంబేద్కర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

ధర్పల్లి, డిసెంబర్ 26: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై కేంద్ర మంత్రి అమిత్‌షా పార్లమెంట్‌లో చేసిన వ్యాఖ్యలు బాధాకరమని ఐడీసీఎంఎస్ చైర్మన్ తారాచంద్‌నాయక్ అన్నారు. బంజారా సేవా సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో అంబేద్కర్ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేసి, పూలమాల వేసి నివాళులర్పించారు. అంబేద్కర్‌పై కేంద్ర మంత్రి చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బంజారా సంఘం నాయకుడు లాల్‌సింగ్ నాయక్, గిరిజనులు పాల్గొన్నారు.

నేడు బెటాలియన్‌లో దీక్షాంత్ పరేడ్

డిచ్‌పల్లి, డిసెంబర్ 26: రాష్ట్ర ప్రత్యేక పోలీస్ 7వ బెటాలియన్‌లో నేడు (శుక్రవారం) దీక్షాంత్ పరేడ్ నిర్వహించనున్నట్లు బెటాలియన్ కమాండెంట్ సత్యనారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బెటాలియన్‌లో తొమ్మిది నెలలపాటు కమాండో తరహా శిక్షణను పూర్తి చేసుకొని పలు పోలీస్‌స్టేషన్లలో ఉద్యోగ బాధ్యతలను నిర్వహించేందుకు వెళ్తున్న వారి నుంచి ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు చంద్రశేఖర్‌రెడ్డి గౌరవ వందనం స్వీకరిస్తారని పేర్కొన్నారు. అనంతరం వారికి సర్టిఫికెట్లను అందజేస్తూ విధి నిర్వహణలో బాధ్యతలపై పలు సూచనలు చేస్తారని పేర్కొన్నారు.

ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వరుస దాడులు

అధికారులు సీజ్ చేసిన లిక్కర్

వినాయక్‌నగర్, డిసెంబర్ 26: నిజామాబాద్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం ఆధ్వర్యంలో పలు ప్రాంతాల్లో వరుస దాడులు నిర్వహించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ స్వప్న ఆధ్వర్యంలో నిజామాబాద్, నవీపేట్, యంచ చెక్‌పోస్టు ఏరియాల్లో నిర్వహించిన దాడి, తనిఖీల్లో గంజాయి, దేశీదారు, ఎన్‌డీపీఎల్‌ను సీజ్ చేసి, నిందితులను అరెస్టు చేశారు. 15 రోజుల వ్యవధిలో చేసిన దాడుల్లో మొత్తం తొమ్మిది కేసులు నమోదు చేశారు. అక్రమంగా తరలిస్తున్న 19 లీటర్ల దేశీదారుతోపాటు 22 లీటర్ల నాన్‌డ్యూటీ పెయిడ్ లిక్కర్, 1.6 కేజీల గంజాయి సీజ్ చేశారు. ఆరు బైకులను సీజ్ చేసి, పది మంది నిందితులను అరెస్టు చేశారు. పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ స్వప్న తెలిపారు.

ఆలయ భూమిని స్వచ్ఛందంగా అప్పగించాలి

- కబ్జాదారులకు కాలూర్, కోటయ్యక్యాంప్ గ్రామపెద్దల హెచ్చరిక
- లేదంటే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరిక

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కాలూర్ గ్రామపెద్దలు, కాంగ్రెస్ నాయకులు

సారంగాపూర్, డిసెంబర్ 26: మండలంలోని కాలూర్, ఆకుల కొండూర్ గ్రామశివారులో ఉన్న నల్ల పోచమ్మ ఆలయానికి సంబంధించి అక్రమంగా కబ్జాకు గురైన 38 గుంటల భూమిని కబ్జాడదారులు వెంటనే స్వచ్ఛందంగా ఆలయానికి అప్పజెప్పాలని కాలూర్, కోటయ్యపల్లి క్యాంప్ గ్రామపెద్దలు అగ్గు భోజన్న, వెంకట్‌రెడ్డి రాజిరెడ్డి, శ్రీనివాస్‌రావు, భూమి దాత కుర్మె నర్సింహులు డిమాండ్ చేశారు. లేని పక్షంలో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని కబ్జాదారులను హెచ్చరించారు. గురువారం నల్లపోచమ్మ గుడి ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గౌరీశంకర్‌కు చెందిన 12ఎకరాల భూమిలో పంట సాగు చేస్తున్న క్రమంలో 50 ఏండ్ల క్రితం 38 గుంటల భూమిని నల్లపోచమ్మ ఆలయానికి కేటాయించారని తెలిపారు. ఈ ఆలయ భూమిని ఇద్దరు కాంగ్రెస్ నాయకులు కలిసి ఒక్కొక్కరి పేరిట 19 గుంటల చొప్పున రెవెన్యూ రికార్డులో అక్రమంగా మార్పిడి చేసుకున్నారన్నారు. ఇటీవల ఆ భూమిలో కబ్జాదారు అర్ధరాత్రి బోరు వేయటానికి ప్రయత్నించగా అది ఇరుక్కుపోయింది. దీంతో సమీపంలో ఉన్న వ్యవసాయ పొలాల రైతులు గమనించి, ఆరా తీయగా కాంగ్రెస్ నాయకులు ఆలయ భూమి కబ్జా చేశారనే విషయం బయట పడింది. ఈ నేపథ్యంలో ఇటీవల అంబులెన్స్‌లో ప్రజావాణి కార్యక్రమానికి వెళ్లి భూమి దాతలు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆర్డీవో రాజేంద్రకుమార్, తహసీల్దార్‌కు ఆలయ భూమి కబ్జాపై విచారణ చేసి నివేదిక సమర్పించాలని కలెక్టర్ సూచించారు. కబ్జాకు గురైన ఆలయ భూమి విషయంలో రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డికి ఎలాంటి సంబంధం లేదన్నారు. కబ్జాకు గురైన భూమి గురించి ఎమ్మెల్యేకు వివరించగా.. విచారణ జరిపించి ఆలయానికి కేటాయించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆయన చెప్పారన్నారు. ఇకనైనా కాంగ్రెస్ నాయకులు భూమిని వెంటనే స్వచ్ఛందంగా ఆలయం పేరిట మార్పిడి చేసి సహకరించాలన్నారు. లేనిపక్షంలో తాము సీఎం రేవంత్‌రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి ఫిర్యాదు చేస్తామని స్పష్టంచేశారు.

ఘనంగా సీపీఐ శత జయంతి ఉత్సవాలు

నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు, కార్యకర్తలు

కోటగిరిలో జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఖలీల్‌వాడి, డిసెంబర్ 26: సీపీఐ శత జయంతి ఉత్సవాలను ఆ పార్టీ నాయకులు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలోని శ్రద్ధానంద్ గంజ్ నుంచి అంబేద్కర్ కాలనీలోని రైస్‌మిల్ హమాలీ యూనియన్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ పార్టీ జెండాను సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాన్పూర్‌లో డిసెంబర్ 26,1925లో సీపీఐ ఆవిర్భవించిందని తెలిపారు. నిజాం నవాబు మెడలు వంచి హైదరాబాద్ సంస్థానాన్ని భారతదేశంలో విలీనం చేసి, దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం అందించిన ఘటన సీపీఐది అన్నారు. నాయకులు వెంకటేశ్వర్లు, ముత్యాలు, గంగారామ్‌నకు శాలువాలు కప్పి సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు సుధాకర్, ఓమయ్య, రంజిత్, రఘురాం, అంజలి, ఇమ్రాన్‌అలీ, సఖి, సురేశ్, భాను, పరశురాం, కవిత, దేవేందర్, హన్మాండ్లు, సంపత్, సాయిలు, సాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

జెండా ఆవిష్కరణ..

కోటగిరి, డిసెంబర్ 26: కోటగిరిలో సీపీఐ శతజయంతి ఉత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. మండల కార్యదర్శి విఠల్‌గౌడ్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. రైతులు, కూలీలు, కార్మికుల కోసం ఉద్యమించిన ఘన చరిత్ర సీపీఐది అన్నారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి దుబాస్ రాములు, నాయకులు బుడాల రాజు, రాములు, శివరాజ్, శంకర్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ నిర్మాణానికి శంకుస్థాపన

పీహెచ్‌సీ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పోచారం

చందూర్, డిసెంబర్ 26: చందూర్‌లో నిర్మించనున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవన నిర్మాణానికి బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతుతో కలిసి గురువారం శంకుస్థాపన చేశారు. దవాఖాన నిర్మాణానికి స్థలం అందజేసిన పరుచూరి చందావతి – విద్యాసాగర్ దంపతులను సన్మానించారు. ఈ సందర్భంగా పోచారం మాట్లాడుతూ.. పీహెచ్‌సీకి స్వర్గీయ సుబ్బారావు పేరు పెడుతామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీ చైర్మన్ కాసుల బాలరాజు, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, డీఎంహెచ్‌వో రాజశ్రీ, పీఆర్ ఈఈ శంకర్, మాజీ జడ్పీటీసీ అంబర్ సింగ్, తహసీల్దార్ శాంత, ఎంపీడీవో నీలావతి, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేశ్, మాజీ ఎంపీపీ లావణ్య, సొసైటీ చైర్మన్ ప్యారం అశోక్, మాజీ సర్పంచులు సాయారెడ్డి, బొడ్డోళ్ల సత్యనారాయణ, దాసరి గంగారాం, దేవీసింగ్, రవి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

దుప్పట్లు పంపిణీ చేస్తున్న వారిటబుల్ ట్రస్టు బాధ్యులు

వర్ని(రుద్రూర్), డిసెంబర్ 26: మాదాల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిరుపేదలకు దుప్పట్లు, రగ్గులు, పండ్లు పంపిణీ చేశారు. వర్నిలోని సీసీడీలో మాదాల అంబయ్య 54వ వర్ధంతిని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా చలికాలాన్ని దృష్టిలో ఉంచుకొని పేదలకు దుప్పట్లు, రగ్గులు పంపిణీ చేసినట్లు ట్రస్టు బాధ్యులు తెలిపారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సుబ్బారావు, సీసీడీ మేనేజర్ ఠాగూర్, శ్రీను, నగేశ్ కులకర్ణి, కృష్ణ, కనకరాజు, నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

వైన్స్ ఎదుట వ్యక్తి మృతి

వినాయక్‌నగర్, డిసెంబర్ 26: నగరంలోని త్రీటౌన్ పరిధిలో ఉన్న ఓ వైన్స్ ఎదుట గురువారం ఓ వ్యక్తి మృతదేహం లభించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా నస్రుల్లాబాద్ మండలం బొమ్మన్‌దేవ్‌పల్లి గ్రామానికి చెందిన మాగిడి కృష్ణ బోరు రిపేరు చేసేందుకు వెళ్తున్నట్లు చెప్పి ఇంట్లో నుంచి బయల్దేరాడు. కాగా.. గురువారం అతడి మృతదేహాన్ని నగరంలోని లలితామహల్ థియేటర్ వద్ద స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. అక్కడ లభించిన ఆధారాలతో కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడి భార్య భాగ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నేడు ఈజీఎస్ సామాజిక తనిఖీ ప్రజావేదిక

డిచ్‌పల్లి, డిసెంబర్ 26: ఎన్ఆర్ఈజీఎస్ 15వ విడుత సామాజిక తనిఖీ ప్రజావేదికను డిచ్‌పల్లి మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శ్రీనివాస్‌గౌడ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 34గ్రామాల్లో చేపట్టిన పనుల వివరాలను సామాజిక తనిఖీ బృందం ప్రజావేదికలో చదివి వినిపిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఆర్డీవో సాయాగౌడ్ హాజరవుతారని తెలిపారు.

జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీలకు తరలిన క్రీడాకారిణులు

సుమలత, నిషా

డిచ్‌పల్లి, డిసెంబర్ 26: జాతీయ స్థాయి బేస్‌బాల్ సీనియర్ జట్టుకు ఎంపికైన సుమలత, నిషా పంజాబ్‌కు గురువారం బయల్దేరి వెళ్లినట్లు బేస్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎల్.మధుసూదన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సొప్ప వినోద్‌కుమార్ గురువారం తెలిపారు. జగిత్యాల జిల్లాలో ఈనెల 7నుంచి 9వ తేదీ వరకు నిర్వహించిన పోటీల్లో సుద్దపల్లిలోని సాంఘిక సంక్షేమ జూనియర్ కాలేజీకి చెందిన సుమలత, నిషా ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపికైనట్లు చెప్పారు. పంజాబ్‌లో ఈనెల 29వ తేదీ వరకు నిర్వహించనున్న పోటీల్లో వారు పాల్గొంటారని తెలిపారు. క్రీడాకారులను బేస్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్వేత, కోశాధికారి డాక్టర్ చిన్నకృష్ణ, సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ప్రభాకర్‌రెడ్డి, మార్కంటి గంగామోహన్, వాలీబాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొజ్జ మల్లేశ్‌గౌడ్, తెలంగాణ సాంఘిక సంక్షేమ పాఠశాల జిల్లా స్పోర్ట్స్ కో–ఆర్డినేటర్ నీరజారెడ్డి, అకాడమీ కోచ్ మౌనిక, వ్యాయామ ఉపాధ్యాయులు జ్యోత్స్న, శ్రీలత, సాఫ్ట్‌బాల్ జిల్లా కోచ్ అనికేత్ నరేశ్ అభినందించారు.

బంకెట్‌హాల్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

మోర్తాడ్‌లోబంకెట్‌హాల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వేముల

మోర్తాడ్, డిసెంబర్ 26: మండల కేంద్రంలో గురువారం టీఎస్ఆర్ బంకెట్‌హాల్‌ను మాజీమంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో అజయ్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఏలియా, చిన్నారెడ్డి, పాపాయిపవన్, బోగ ఆనంద్, ఏనుగు రాజేశ్వర్, చిన్న రాజేశ్వర్, దడివె నవీన్, వివిధ మండలాల నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు మోతె విద్యార్థి

వేల్పూర్, డిసెంబర్ 26: మండలంలోని మోతె పాఠశాల విద్యార్థి జి.వేదాంశ్ రాష్ట్రస్థాయి సీఎం కప్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం శ్రీ వైద్య గణేశ్ గురువారం తెలిపారు. ఈనెల 27,28,29 తేదీల్లో మహబూబ్‌నగర్ జిల్లాలో నిర్వహించనున్న కబడ్డీ పోటీల్లో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థిని హెచ్ఎంతోపాటు పీడీ ఎం.సురేశ్‌మార్, కబడ్డీ కోచ్ పరంజ్యోతి, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

రేపు సీపీఐఎంఎల్ విలీన సభ

ఆర్మూర్‌లో పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆర్మూర్‌టౌన్, డిసెంబర్26: ఈనెల 28న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ విలీన సభ నిర్వహించనున్నట్లు ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు సూర్యశివాజీ తెలిపారు. పట్టణంలోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అనంతరం విలీన సభ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు గులాం, వర్ణరెడ్డి, నజీర్, ఇన్నా, హుస్సేన్, షోయజ్, వాజీద్ తదితరులు పాల్గొన్నారు.

విలీన సభ పోస్టర్ల ఆవిష్కరణ

డిచ్‌పల్లి, డిసెంబర్ 26: సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ విలీన సభను విజయవంతం చేయాలని పార్టీ రూరల్ కార్యదర్శి గంగాధర్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో విలీన సభకు సంబంధించిన పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు. హైదరాబాద్‌లోని సుందరయ్య భవన్‌లో ఈనెల 28వ తేదీన విలీన సభ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో రాజు, సాయిలు, గంగామణి, గంగవ్వ, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

ఆర్మూర్‌టౌన్, డిసెంబర్26: మండలంలోని పిప్రి గ్రామానికి చెందిన మంద దేవేంద్ర(20) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గౌడ్ కథనం ప్రకారం.. బుధవారం దేవేంద్ర ఇంట్లో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానకు తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

రైల్వే గేటు వద్ద కొనసాగుతున్న మరమ్మతు పనులు

రైల్వే గేటు మరమ్మతు పనులు ప్రారంభం

- ఇబ్బందులు ఎదుర్కొన్న వాహనదారులు
- వాహనాలను దారిమళ్లించిన అధికారులు

నవీపేట, డిసెంబర్ 26: మండలం కేంద్రంలోని బాసర ప్రధాన రోడ్డుపై ఉన్న రైల్వేగేటు మరమ్మతు పనులను రైల్వే అధికారులు గురువారం ప్రారంభించారు. ఈనెల 30 వరకు ఈ పనులు కొనసాగనున్నాయి. దీంతో అధికారులు ట్రాఫిక్‌ను మళ్లించారు. బాసర నుంచి నిజామాబాద్ వైపు వెళ్లే వాహనదారులు కమలాపూర్, మోకన్‌పల్లి జలాల్‌పూర్, గుండారం మీదుగా వెళ్లాలని సూచించారు. బాసర వైపు వెళ్లే వారు కల్యాపూర్, సాటాపూర్, తాడ్‌బిలోలి, ఫకీరాబాద్ మీదుగా ప్రయాణించాలని రైల్వే అధికారులు సూచించారు. మరో నాలుగు రోజుల వరకు రైల్వే గేటు మరమ్మతు పనులు కొనసాగుతాయని తెలిపారు.

రెంజల్ రూట్లో పెరిగిన ట్రాఫిక్

రెంజల్, డిసెంబర్ 26: మండలంలోని రహదారులు వాహనాల రాకపోకలతో రద్దీగా మారాయి. మరమ్మతు పనుల కారణంగా నవీపేట్ రైల్వేగేట్‌ను మూసివేయడంతో వాహనాలను దారి మళ్లించారు. బాసర, భైంసా తోపాటు ఇతర ప్రాంతాలకు వెళ్లే బస్సులు, వాహనాలు రెంజల్ మండలంలోని రెంజల్, సాటాపూర్, బోర్గాం మీదుగా వెళ్లాయి. దీంతో వాహనాల రద్దీ పెరిగింది. సాటాపూర్ – బోర్గాం మార్గంలో సింగిల్ రోడ్డు ఉండడంతో ఇబ్బందికరంగా మారింది. ట్రాఫిక్ నియంత్రణకు అధికారుల చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

ఇరుకు రోడ్డుగుండా వెళ్తున్న వాహనాలు

ఈ-ఫైలింగ్ చేసుకోవాలి

మావేశంలో మాట్లాడుతున్న బార్ అధ్యక్షుడు జగన్ మోహన్

వినాయక్‌నగర్, డిసెంబర్26: నిజామాబాద్ బార్ అసోసియేషన్‌లో సభ్యులుగా ఉన్న జిల్లా న్యాయవాదులు ఈ ఫైలింగ్ చేసుకోవాలని బార్ అధ్యక్షుడు జగన్ మోహన్ గౌడ్ కోరారు. జిల్లా కేంద్రంలో గురువారం నిర్వహించిన న్యాయవాదుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు ఈ–కోర్టు వెబ్ సైట్‌లో పేరు నమోదు చేసుకుంటే అందులోనే సివిల్ దావాలు, క్రిమినల్ కేసుల బెయిలు దరఖాస్తులు చేసుకోవడానికి వీలు అవుతుందని ఆయన పేర్కొన్నారు. హైకోర్టు ఆదేశం మేరకు న్యాయవాదులు అందరూ జనవరి 15 లోగా తప్పక ఈ ఫైలింగ్ చేసుకోవాలని సూచించారు. అలాగే బార్ కౌన్సిల్ ఆఫ్ తెలంగాణ ఆదేశం మేరకు న్యాయవాదులందరూ ఈనెల 31 లోపు సర్టిఫికెట్ ఆఫ్ ప్రాక్టీస్(సీఓపీ) రెన్యువల్ సంబంధిత సర్టిఫికెట్లతో బార్ కౌన్సిల్లో దరఖాస్తు చేసుకొని న్యాయవాదులు వృత్తి నిర్వహణ సర్టిఫికెట్లను పొందాలని కోరారు.

ఇసుక లారీ పట్టివేత

పోలీసులు పట్టుకున్న ఇసుకలారీ

మోర్తాడ్, డిసెంబర్ 26: మండల కేంద్రం నుంచి బుధవారం రాత్రి అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని పట్టుకున్నట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు. డ్రైవర్ సందీప్ పండార్‌ను పట్టుకుని రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు. వారం రోజుల లోపే రెండుసార్లు ఒకేలారీని పట్టుకోవడాన్ని బట్టి చూస్తే మోర్తాడ్ నుంచి అక్రమంగా ఇసుక ఏ మేరకు తరలివెళ్తుందో తెలుస్తున్నది.

సీపీఐ జెండా ఆవిష్కరణ

బోధన్ అంబేద్కర్ చౌరస్తాలో సీపీఐ జెండాను ఎగురవేస్తున్న పార్టీ నాయకులు

శక్కర్‌నగర్/ఆర్మూర్‌టౌన్, డిసెంబర్ 26: బోధన్ పట్టణంలో గురువారం సీపీఐ శత జయంతి ఉత్సవాల సందర్భంగా పార్టీ జిల్లా నాయకురాలు మంద స్వరూప రాణి పార్టీ జెండాను ఎగురవేశారు. ఆమె మాట్లాడుతూ.. భారత కమ్యూనిస్టు పార్టీ 26 డిసెంబర్ 1925లో కాన్పూర్‌లో ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సమస్యలు పరిష్కరించాలని, లేని పక్షంలో ఆందోళనలు చేపడతామని ఆమె హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు జయమ్మ, సలీం, కృష్ణ, వెంకటేశ్, శంకర్, దత్తుతో పాటు పలువురు ఉన్నారు. ఆర్మూర్ పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా నాయకుడు ఆరేపల్లి సాయిలు మాట్లాడుతూ.. పార్టీ ఆవిర్భవించి వందేండ్లు పూర్తయిన సందర్భంగా అంబేద్కర్ చౌరస్తా వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించామని అన్నారు.

కొనసాగుతున్న నీటివిడుదల

మోర్తాడ్, డిసెంబర్ 26: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి యాసంగి పంటల కోసం కాలువల ద్వారా అధికారులు నీటిని వదులుతున్నారు. కాకతీయ కాలువకు 2750 క్యూసెక్కులు, లక్ష్మీకాలువకు 200 క్యూసెక్కులు, అలీసాగర్ లిఫ్ట్‌కు 360 క్యూసెక్కులు, గుప్తాలిఫ్ట్‌కు 270 క్యూసెక్కులు, సరస్వతీ కాలువకు 375 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు నీటిని వదులుతున్నారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091అడుగులు (80.5టీఎంసీలు) కాగా ప్రస్తుతం ప్రాజెక్ట్‌లో 1090.80అడుగులు (79.658టీఎంసీలు) నీరు నిల్వ ఉన్నది.

నేడు ద్విచక్ర వాహనాల వేలం

భీమ్‌గల్, డిసెంబర్ 26: భీమ్‌గల్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుడిన రెండు ద్విచక్ర వాహనాలను శుక్రవారం వేలం వేయనున్నట్లు స్టేషన్ హౌస్ ఆఫీసర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వారు పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

హెచ్ఎంకు సన్మానం

హెచ్ఎం జ్యోతిని సన్మానిస్తున్న సోషల్ వర్కర్ సనాపటేల్

శక్కర్‌నగర్, డిసెంబర్ 26: బోధన్ పట్టణంలోని బీటీ నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం జ్యోతిని స్థానిక సోషల్‌వర్కర్ సనా పటేల్ ఆధ్వర్యంలో సన్మానించారు. హెచ్ఎం అందిస్తున్న సేవలు ఎనలేనివని, విద్యార్థులకు ఉత్తమ బోధన అందజేస్తున్నారని అన్నారు.

రక్తదానం శిబిరం

రక్తదానం చేస్తున్న యువకులు

మాక్లూర్, డిసెంబర్ 26:మెట్టు గ్రామంలో గురువారం ఈడెన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. 25 మంది ఫౌండేషన్ సభ్యులు రక్తదానం చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖాన బ్లడ్ బ్యాంకు ఇన్‌చార్జి ప్రేమ్‌చంద్ ఆధ్వర్యంలో కార్యక్రమం కొనసాగింది. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు సోమయ్య, ప్రధాన కార్యదర్శి సునీల్, కోశాధికారి అనిల్‌కుమార్, చర్చి పాస్టర్ ప్లాంటిన్ పాల్గొన్నారు.

చెరువులో పడి పశువుల కాపరి మృతి

రెంజల్, డిసెంబర్ 26: మండల కేంద్రానికి చెందిన తూర్పు రాజు (40) గురువారం చెరువులో పడి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. గ్రామంలోని ఎండీ లియాఖత్ వద్ద పనిచేసే రాజు పశువులను మేపేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడిపోయాడు. అదే గ్రామానికి చెందిన పాముల గంగాధర్ గమనించి కుటుంబీకులకు సమాచారం అందించాడు. వెంటనే పోలీసులకు కూడా సమాచారం అందించాడు. పోలీసులు చెరువులో గంగపుత్రుల సాయంతో గాలింపు చర్యలు చేపట్టి రాజు మృతదేహాన్ని బయటికి తీయించారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం బోధన్ జిల్లా ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతుడి భార్య తూర్పు రేఖ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.